క్లుప్తంగా

ప్రాఫిట్ షూ కంపెనీ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: నగరంలో ప్రాఫిట్ షూ కంపెనీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద ముఖ్య అతిథులుగా శనివారం ప్రారంభించారు. అనంతరం కంపెనీలో షూలను పరిశీలించారు. ప్రారంభోత్సవంలో భాగంగా ప్రతి షూ కొనుగోలుపై 10 శాతం రాయితీ ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ దుర్గారావ్, ఏరియా మేనేజర్ ఇర్ఫాన్, స్టోర్‌మేనేజర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్ వేడుకలు

చిత్తూరు రూరల్: నగరంలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను జరుపుకోనున్నారు. ఇందుకు నగర, మండలంలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు, ప్రార్థనలు జరగనున్నాయని మతపెద్దలు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పోస్టల్‌శాఖ ఉద్యోగులకు క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. శనివారం స్థానిక మెసానికల్ మైదానంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏవీ.భాస్కర్, రీజినల్ డైరెక్టర్ పూలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 14,15,16 తేదీల్లో కర్నూలు రీజినల్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆ పోటీలకు చిత్తూరు జిల్లా పోస్టల్ ఉద్యోగులు పాల్గొంటారని చెప్పారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూతలపట్టు: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎంపీడీఓ గౌరి, ఎస్‌ఐ హరిప్రసాద్ తనిఖీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలవరంలో 61 మంది, పి.కొత్తకోటలో 152, పూతలపట్టులో 124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం



తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.

జీడీనెల్లూరు ఎస్‌ఐగా రామాంజనేయులు



ఎస్‌ఐ రామాంజనేయులు

గంగాధరనెల్లూరు: మండల ఎస్‌ఐగా బండి రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుడిపల్లి మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు వీఆర్‌కు వెళ్లారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఐకమత్యంగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి ప్రజలు కృషి చేయాలని, యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.

మానని గాయాలు..!

- అల్సర్‌తో జాగ్రత్త
- మధుమేహుల్లో తగ్గుతున్న రక్త ప్రసరణ
- మూసుకుపోతున్న రక్తనాళాలు
- ప్రతి నెలా 30 నుంచి 40 మందికి కాళ్లు, వేళ్లు తొలగిస్తున్న వైనం
- అనధికారంగా వందల సంఖ్యలో ఉండవచ్చని అధికారుల అంచనా
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యనిపుణులు



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు

దీర్ఘకాలికంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారిలో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. గుండె నుంచి కాళ్లకు రక్తం అందే పరిణామం తగ్గడం వల్ల రక్త నాళాలు మూసుకుపోయి స్పర్శ తగ్గిపోతుంది. ఫలితంగా కాళ్లకు దెబ్బలు తగిలినప్పుడు ఎంతకూ మానవు. దీన్నే డయాబెటిక్ ఫుట్ అల్సర్లు అంటారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఉపశమనం పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

చిత్తూరు రూరల్: మానని పుండ్లు (అల్సర్స్).. ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. రక్తనాళాలు మూసుకుపోయి కాళ్లకు రక్తప్రసరణ కాక పుండ్లు ఏర్పడుతున్నాయి. ఇవి మానకపోవడంతో శరీర భాగాలను కొంత వరకు తొలగించాల్సి వస్తోంది. ఇలాంటి కేసులు ప్రభుత్వాస్పత్రికి ఎక్కువగా వస్తున్నాయి. వీరందరినీ ప్రభుత్వాస్పత్రి సెప్టిక్ వార్డులో ఉంచి చికిత్స చేస్తున్నారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సెప్టిక్‌వార్డులో మొత్తం 20 పడకలు ఉండగా.. పురుషులకు 10, స్త్రీలకు 10 పడకలు కేటాయించారు. ఈ పడకలు చాలకపోవడంతో జనరల్ వార్డులో 150 బెడ్లలో సైతం ఇన్ఫెక్షన్ రోగులను ఉంచుతున్నారు. ఈ వార్డులో ఉన్న వారిలో 80 శాతం మందికిపైగా మధుమేహం కారణంగా మానని పుండ్లు, కుళ్లిన పుండ్లు పడిన వారే ఎక్కువగా ఉంటున్నారు. ఇటీవల కాలంలో ఈ వార్డులో ఉంటున్న రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

పరిస్థితి బట్టి అవయవాల తొలగింపు..

ఒక్క జిల్లా ప్రభుత్వాస్పత్రిలోనే నెలకు నుంచి 30 నుంచి 40 మందికి అవయవాల తొలగింపు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అల్సర్‌కు వందల సంఖ్యలో చికిత్స తీసుకుంటున్నారని అధికారుల అంచనా. వీరిలో కొందరికి వేళ్లు, మరికొందరికి పాదాలు, ఇంకొందరికి మోకాలు వరకూ, ఇంకొందరికీ తుంటి వరకు కాళ్లు తొలగించిన సందర్భాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. కాళ్లు, కాళ్ల వేళ్ల తొలగిస్తున్న వారిలో 90 శాతం మందికి మధుమేహం కారణం కాగా, 5 శాతం మందికి ధూమపానం, వెరికోస్ వెయిన్స్ కారణంగా చెబుతున్నారు. ఇంకా లెప్రసీ, వెన్నెముఖ గాయం, క్యాన్సర్ వంటి వ్యాధులు ఉన్న వారికి కూడా రక్తనాళాలు మూసుకుపోతుంటాయి.

జాగ్రత్తలు

- పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి.
- మద్యపానం, పొగతాగడం అలవాటు మానేయాలి.
- కారం, మసాలా ఆహారాల విషయంలో జాగ్రత్త వహించాలి.
- కంటినిండా నిద్రపోవాలి.
- మానసిక ఒత్తిడి దూరం కావడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి
- ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. సమతులాహారం తీసుకోవాలి

ఆలస్యం చేయడం వల్లే..



అదుపులో లేని మధుమేహంతో అనేక దుష్ఫలితాలు రావచ్చు. ఇలాంటి వారికి గాయమైతే మానడం లేదు. వీరు క్రమం తప్పకుండా మందులు వాడాలి. తొలి దశలోనే సమస్యను గుర్తించి, తీవ్రతరం కాకుండా చూడవచ్చు. కానీ చాలా మంది అల్సర్, మధుమేహం విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. క్లినిక్‌ల చుట్టూ తిరుగుతున్నారు. ఇలా చేయడం వల్ల ఆ ప్రభావం కాళ్లు, వేళ్ల మీదకు వస్తోంది. జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ అరుణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

పేదలకు అండగా ప్రభుత్వం



స్థానికులకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారం నగరంలోని 35వ డివిజన్ గంగిరెడ్డి పాఠశాల, సమీప ప్రాంతాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానికులు కోరారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని సూచించారు. పలు కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు, ఎందుకు అందలేదని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అర్హులుగా ఉన్నవారికి పథకాలు ఖచ్చితంగా అందాలన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పలత, కమిషనర్ అరుణ, మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, పార్టీ నాయకులు కేపీ శ్రీధర్, రమణ, రజిని, రాజేశ్వరి, గుర్రప్ప, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 28వ డివిజన్‌లో..

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 28వ డివిజన్ కొండమిట్టలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. జెడ్పీ కార్యాలయ సమీపంలోని వినాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం తెలిపారు. మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

తవణంపల్లె: మండలంలోని జొన్నగురకల పంచాయతీలో సోమవారం ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమం జరుగుతుందని తవణంపల్లె ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు. అదే విధంగా 11వ తేదీ మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఎగువ తడకర పంచాయతీలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లో ఎస్‌ఈబీ అధికారులు శనివారం అక్రమ మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 52 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బంగారుపాళ్యం మండలానికి చెందిన శ్రీనివాసులు (44), యాదమరి మండలం భూమిరెడ్డిపల్లెకి చెందిన చిట్టెమ్మ (52)లను అరెస్ట్ చూసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్ బాబు, సిబ్బంది కష్టయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి



పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

ఐరాల: పిల్లలకు నిర్దేశిత సమయాల్లో తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని వీఎస్ అగ్రహారం, తెల్లగుండ్లపల్లె, పేయన్నగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వ్యాక్సిన్లు వేశారు. పోలియో, చికెన్ ఫాక్స్, తట్టు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్

చిత్తూరు రూరల్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్తూరులో క్రైస్తవులు శనివారం రన్‌ఫర్ జీసస్ నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మన్ పాఠశాల నుంచి నగర వీధుల్లో ర్యాలీ చేశారు. పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిస్టిదాస్, ఇమ్మానియేల్, ప్రకాష్, ప్రేమ్, జసింతా తదితరులు గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

నేటి నుంచి ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రరాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మహతి కళాక్షేత్రంలో ఆది, సోమవారం ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఆయన శనివారం మహతి కళాక్షేత్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలుగు భాషా విశిష్టత కోసం శ్రీశ్రీ కళావేదిక నిరంతరం కృషి చేస్తూ కవులు, కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే తిరుపతిలో ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించి వరల్డ్ రికార్డు నెలకొల్పేలా 48 గంటల నిరవధికంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం కన్వీనర్ గుత్తాహరి సర్వోత్తమ నాయుడు, కన్వీనర్ కొల్లి రమావతి, శ్రీశ్రీ కళావేదిక తెలంగాణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాపసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది

గుడిపాల: మండలంలోని పాపసముద్రం గ్రామంలో గుడిపాల పీహెచ్‌సీ వైద్యురాలు సుకన్య ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది విజయ, కవిత, రుక్మిణి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి, ఏపీ ఐసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సినీ డైరెక్టర్ గౌరీరోణంకి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

గణనాథుని సేవలో ప్రముఖులు





ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి



సురేంద్రనాథ్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, ముఖ్యమంత్రి సతీమణి వైఎస్ భారతి సోదరుడు సురేంద్రనాథ్ రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చారు. ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి వారికి స్వాగతంపలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం చేయించి, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. డీఈఓ రంగయ్య, ఏఈఓ శ్యాంసుదర్, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు ఉన్నారు.

అందమైన చిత్తూరు కోసం..!

- ట్రాఫిక్ కష్టాలు తొలగించడంపై పోలీసుల దృష్టి
- రూ.20 లక్షలతో కార్పొరేషన్ మెరుగులు
- ప్రధాన కూడళ్లల్లో హైమాస్ట్ లైట్లు.. పచ్చదనం



చౌడేశ్వరి ఆలయ కూడలి అభివృద్ధి కోసం రూపొందించిన డిజైన్



గాంధీ విగ్రహం వద్ద డీఎస్పీలతో చర్చిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఇరుకైన రోడ్లు.. గజిబిజి ట్రాఫిక్ సమస్యతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8–9, సాయంత్రం 5–7 గంటల మధ్య నగరంలోని ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ కష్టాలు అన్నీ ఇన్నీకావు. వీటిని పరిష్కరించడంతో పాటు నగరాన్ని అందంగా తీర్చిదిద్దడానికి మున్సిపల్ కార్పొరేషన్ నడుం బిగించింది. పోలీసుశాఖ సూచనలు తీసుకుని నగర సుందరీకరణకు కార్పొరేషన్ పాలకవర్గం ఆమోదముద్ర వేయడంతో కమిషనర్ అరుణ తన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు.

రూ.20 లక్షల నిధులు

చిత్తూరులో పెరుగుతున్న జనాభాతోపాటు అవసరాల కోసం వాహనాల వినియోగం కూడా పెరిగింది. అయితే వీటి నుంచి కాలుష్యం పెరుగుతోంది. కాలుష్య ఘంటికలు పెరుగుతున్న నగరాల్లో చిత్తూరు ఉండడంతో కేంద్రం పలుమార్లు హెచ్చరించింది. కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, పచ్చదనం పెంచడానికి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కింద రూ.20 లక్షల నిధులు విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా తొలుత చిత్తూరు నగరంలోని ఎంఎస్‌ఆర్ కూడలి, దర్గా కూడలి, గిరింపేట కూడళ్లను అభివృద్ధి చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి సిగ్నల్ లైట్లు, కూడళ్లల్లో పచ్చదనం ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల ఎస్పీ రిషాంత్ రెడ్డిని కలిసి పోలీసుశాఖ నుంచి ప్రతిపాదనలు ఇవ్వడంతో పాటు, పోలీసుశాఖ ఇచ్చే సూచనలు కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

కూడళ్ల అభివృద్ధి

ఎన్‌సీఏపీ నిధులతో పాటు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చిత్తూరులోని పలు కూడళ్లను అభివృద్ధి చేయడానికి యంత్రాంగం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా కమిషనర్ అరుణ, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, తిప్పేసామి కలిసి గాంధీ విగ్రహం వద్ద కూడలిని ఇటీవల పరిశీలించారు. ఇక్కడ రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించడం, భారీ హైమాస్ట్ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయడం, త్రిభుజాకారంలో పచ్చని మొక్కలు పెట్టడం, జీబ్రా లైన్లు ఏర్పాటుపై చర్చించారు. సంతపేట, గాంధీ రోడ్డు, దర్గా కూడలి, చౌడేశ్వరి అమ్మవారి గుడి కూడలి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి సీసీ కెమెరాలు పెట్టడం, ఇప్పటికే పనిచేయని వాటిని రిపేర్లు చేయించడంపై చర్చించారు. గాంధీ విగ్రహం వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసే పనులను కార్పొరేషన్ ప్రారంభించింది. వీటి సమీపంలో డిజిటల్ ప్రకటనలు ఇచ్చే ఎల్‌ఈడీలు ఏర్పాటు చేసి కార్పొరేషన్ ఆదాయం పెంచుకునే దిశగా కూడా ఆలోచన చేస్తున్నట్లు కమిషనర్ అరుణ తెలిపారు. నగర అభివృద్ధికి కార్పొరేషన్ పాలకమండలి, ఎమ్మెల్యే ద్వారా అవసరమైనన్ని నిధులు తెప్పించి పనులు ప్రారంభిస్తామన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి





గుడిపాల: గొల్లమడుగులో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న నాయకులు,
తవణంపల్లె: మాధవరంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిపాల: జగనన్నతోనే సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, సచివాలయ కన్వీనర్ సాయి అన్నారు. శనివారం గుడిపాల మండలంలోని రామభద్రాపురం, బండపల్లె, చిత్తపార, పాపసముద్రం, గొల్లమడుగు పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై సంతృప్తిగా ఉన్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటికి, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీల్‌రాజ్, పెద్దబ్బ, సూరి, ధరణి, రవీంద్రారెడ్డి, వరదరాజులురెడ్డి, చిట్టిబాబు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: సచివాలయ మండల కన్వీనర్ హరికృష్ణారెడ్డి మండలంలోని మాధవరంలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి, పార్టీ నాయకులు రమణారెడ్డి, రవిరెడ్డి, మధుకుమార్, రంజిత్‌రెడ్డి, స్వరూప్‌రెడ్డి, కోదండ పాల్గొన్నారు.



పూతలపట్టు: కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లె పంచాయతీ బూసిపల్లె గ్రామంలో పార్టీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ గణపతిరెడ్డి, మణి, సచివాలయ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, యోగీశ్వర్ పాల్గొన్నారు.

టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

పలమనేరు: డీఎస్సీ నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోందని, ఈ సమస్య పరిష్కారానికి వెంటనే డీ ఎస్సీ నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వప్రధాన కార్యదర్శి బాబురెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ డివిజన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ నాయకుడు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణమూర్తి, గురుమూర్తి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.